క్లుప్తంగా

బస్ పాస్‌ల మేళా

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో దివ్యాంగులకు బస్‌పాస్‌ల మేళాను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 55మంది దివ్యాంగులు బస్‌పాస్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ మాట్లాడుతూ.. ఆర్టీసీ కల్పించిన ఈ సౌకర్యాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, ఎంపీడీఓ ముత్యాలరావు, ఆర్టీసీ అధికారులు అల్లం నాగేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ధర్నా

దమ్మపేట: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వలన తమ జీవనోపాధికి గండి పడిందని ఆవేదన వ్యక్తం చేస్తూ.. రాష్ట్రీయ రహదారిపై ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. బుధవారం మండల పరిధిలోని ఆటో డ్రైవర్లు మండల కేంద్రంలోని జయలక్ష్మి థియేటర్ నుంచి మందలపల్లి జంక్షన్ వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మందలపల్లి రాష్ట్రీయ రహదారిపై ధర్నాను నిర్వహించిన ఆటో డ్రైవర్లు, మాట్లాడుతూ.. తమను ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోలకు పూర్తిగా ఆదాయం తగ్గిపోయిందని, దీంతో ఆటో ఫైనాన్స్ నెలవారి ఈఎంఐలు కట్టలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.

రక్తదానం చేసిన యువత

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో బుధవారం మదర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్టు, పాల్‌రాజ్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 25 మంది యువకులు, విద్యార్థులు రక్తదానం చేశారు. అదే విధంగా 212 బెటాలియన్ సీఆర్పీఎఫ్–ఎటపాకకు చెందిన 10 మంది జవాన్లు రక్తదానం చేశారు. ముక్కోటికి వచ్చే భక్తులకు ఏవైనా రక్తం అవసరమవుతుందనే ఉద్దేశంతో ముందుగానే రక్త సేకరించినట్లు ఏరియా ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు. రక్తదానానికి సహకరించిన బెటాలియన్ కమాండెంబట్ దీపక్ కుమార్ శ్రీవాత్సవకు, పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యానికి, మదర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్టు బాధ్యులకు సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఐక్య తల్లిదండ్రుల సంఘం మండల అధ్యక్షుడిగా శేషగిరి

ములకలపల్లి: ఐక్య తల్లిదండ్రుల సంఘం ములకలపల్లి మండల అధ్యక్షుడిగా అయితా శేషగిరిరావు నియమితులయ్యారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో జిల్లా సెలక్షన్ బోర్డు చైర్మన్ చిప్పా రాంప్రసాద్ నూతన కమిటీని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శులుగా శ్రీరాముల నాగేశ్వరరావు, శనగపాటి రవి, పుష్పాల చందర్‌రావు, మండల కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షులుగా పద్దం నర్సింహారావు, పువ్వాల లలితారావు, అదనపు అధ్యక్షులుగా మిరియాల శ్రీనివాసరావు, పుల్లూరి వేణుగోపాల్, కొడుమూరి వీరగోపాల్ నియమితులయ్యారు. సంఘ జిల్లా అధ్యక్షుడు వసంత్, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ విభాగం జిల్లా చైర్మన్ గోల్డ్ శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానానికి ఐటీసీ ఈఎస్ఆర్ ఈఈ ఫౌండేషన్, వావ్ ఆధ్వర్యంలో రామాలయ పరిసరాల్లో తడిపొడి చెత్త సేకరణ కోసం 44 స్టీల్ డస్ట్‌బిన్స్‌ను ఐటీసీ చీఫ్ మేనేజర్ ఉమాకాంత్ బుధవారం ఆలయ ఈఓ రమాదేవికి అందజేశారు. అలాగే ఆలయ పరిసరాల్లో పని చేసే పారిశుద్ధ్య కార్మికుల రక్షణ కోసం 50 జతల బూట్లు, కళ్లజోళ్లు, మాస్క్‌లు ఇతర సామాగ్రి అందించారు. కార్యక్రమంలో ఐటీసీ పీఎస్‌పీడీ చీఫ్ మేనేజర్ చెంగల్‌రావ్, సత్య శ్రీనివాస్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు రుణం ఇవ్వాలి

అశ్వారావుపేటరూరల్: మిచాంగ్ తుపాను కారణంగా వర్జీనియా పొగాకు రైతులకు తీవ్ర నష్టం జరిగిందని, రైతులను ఆదుకునేందుకు బ్యాంకర్లు అదనపు రుణాలు ఇవ్వాలని పొగాకు బోర్డు కార్యదర్శి వీవీఎస్ ప్రకాశ్ కోరారు. బుధవారం ఖమ్మంలోని యూనియన్ బ్యాంక్ డీజీఎం హనుమంతరెడ్డిను పొగాకు రైతులు కలిసి, వినతి పత్రాన్ని అందించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. తుపాను నష్టం తరువాత మళ్లీ సాగు చేసేందుకు పెట్టుబడి కోసం ఒక బ్యారన్‌కు రూ.2లక్షల చొప్పున అదనపు రుణాన్ని ఇవ్వాలని కోరారు. దాంతో డీజీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. వినతి చేసిన వారిలో రైతులు సుంకవల్లి వీరభద్రరావు, కూకలకుంట కిషోర్, అప్పారావు ఉన్నారు.

వితరణ

మణుగూరురూరల్: మండల పరిధిలోని తిర్లాపురం గ్రామపంచాయతీ బెస్తగూడెం గ్రామానికి చెందిన తండ్రి కొడుకులు కంపెర్ల శంకర్, సతీష్‌లు ఇటీవలే రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి కర్నె రవి, బోటిక శ్రీనివాస్ సహాయంతో 25కేజీల బియ్యాన్ని వితరణగా అందజేశారు. కార్యక్రమంలో నాగార్జున రెడ్డి, సాధని గోవర్ధన్, విత్తనాల శ్రీనివాస్, చారి, నాగేశ్వరరావు, సాంబ తదితరులు పాల్గొన్నారు.

పత్తితీతకు కూలీల కొరత

- తుపాన్ వరకు నిలిచిన పనులు
- ఆఫై ఒకేసారి మొదలవడంతో దొరకని వర్కర్లు
- డిమాండ్ పెరగడంతో కూలి రేట్లు పైపైకి
- రైతుకు తప్పని పెట్టుబడి భారం



కూలీల కొరతతో చేనులోనే రాలిపోతున్న పత్తి

బూర్గంపాడు: మిచాంగ్ తుపాను రైతులను తీవ్రంగా నష్టపరిచింది. తుపాన్ ప్రభావంతో రెండు రోజులు భారీ వర్షాలు కురిశాయి. దీంతో కోత దశలో ఉన్న వరి మాగాణులు నేలకొరిగాయి. బాగా పూసిన పత్తి చేలు వర్షానికి తడిసి పాడైంది. తుపాను కారణంగా వ్యవసాయ పనులు పదిరోజుల పాటు పూర్తిగా నిలిచిపోయాయి. వరికోతలు బాగా ఆలస్యమయ్యాయి. రెండో తీత దశలో ఉన్న పత్తిచేలు వర్షాలకు దెబ్బతిన్నాయి. పదిరోజుల తరువాత పత్తిని తీసేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. అయితే రైతులందరూ ఒకేసారి పత్తి ఏరేందుకు సిద్ధమవటంతో కూలీలకు తీవ్ర కొరత ఏర్పడింది.

వర్షానికి తడిసి, ఆ తరువాత ఆరిన పత్తిని తీయటం బాగా ఆలస్యమవుతుంది. గతంలో రోజుకు 50 కిలోల పత్తిని తీసిన కూలీ ప్రస్తుతం 20 కిలోల పత్తిని మాత్రమే తీస్తున్నారు. దీంతో పత్తి తీతలు బాగా ఆలస్యమవుతున్నాయి. బాగా పూసిన పత్తి చేలోనే కారిపోతుండటంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను తీసుకునేందుకు కూలీలు దొరకక పోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దూరప్రాంతాలకు వెళ్లి కూలీలను తీసుకువచ్చే యత్నాలు చేస్తున్నారు. కూలీల కొరతతో కూలిరేట్లు కూడా పెరిగిపోతున్నాయి. గతంలో కూలీలకు కిలో పత్తి తీసేందుకు రూ.10 చెల్లించేవారు. ప్రస్తుతం కిలో పత్తి తీసేందుకు రూ.12 నుంచి రూ.15 వరకు కూలీలు డిమాండ్ చేస్తున్నారు. చేలలో పూసిన పత్తి పాడవుతుందని పత్తి రైతులు ఆందోళన పడుతున్న ఈ తరుణంలోనే మిర్చి రైతులు కూడా కాయలు కోసేందుకు కూలీల కోసం వెతుకులాడుతున్నారు. ఒక పక్క పత్తితీతలు, మరో పక్క మిర్చి కోతలతో కూలీల డిమాండ్ మరింతగా పెరిగింది. మిర్చి కోసేందుకు కూడా కూలీలు గతంలో కంటె ఎక్కువ రేట్లను డిమాండ్ చేస్తున్నారు.

మణుగూరు, భద్రాచలం వ్యవసాయ డివిజన్‌లలో ప్రస్తుతం పత్తితీతలు, మిర్చి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీల కొరత కారణంగా పత్తితీతలకు కొందరు రైతులు సమీపంలోని ఆంధ్రా నుంచి కూలీలను తీసుకువస్తున్నారు. కూలీలకు రవాణా చార్జీలు చెల్లిస్తు వారిని కూలిపనులకు తీసుకువస్తున్నారు. దీంతో రైతులపై అదనపు భారం పడుతోంది. ఒక మహిళకు రోజుకు రూ.300 కూలీ, రానుపోను చార్జీలకు రూ.70ల వరకు ఖర్చవుతుంది. పత్తి ధరలు చూస్తే రోజురోజుకు పతనమవుతున్నాయి. కూలిరేట్లు పెరిగిపోవటంతో పెట్టుబడులు కూడా తిరిగి రావని రైతులు ఆందోళన చెందుతున్నారు. బూర్గంపాడు మండలంలోని కొన్ని గ్రామాలలో రైతులు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా నుంచి కూలీలను తీసుకువచ్చి వ్యవసాయ పనులు చేయించుకుంటున్నారు. కూలీల కొరత కారణంగా రైతులు అక్కడి నుంచి కూలీలను తీసుకువచ్చి వారికి వసతి ఏర్పాటు చేయటంతో పాటుగా వారి అవసరాలను రైతులు తీర్చుతున్నారు. ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితులతో పత్తి దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. ఎకరాకు సగటున 6 నుంచి 7 క్వింటాళ్ల పత్తి రావటం కూడా కష్టంగా ఉంది. రైతులు తొలివిడతలో తీసిన పత్తికి గిట్టుబాటు ధరలు దక్కలేదు. రెండవ విడత పత్తితీతలు మొదలు పెట్టిన తరుణంలో తుపాను పంటలను నష్టపరిచింది. ప్రస్తుతం రైతులు పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాలలో విక్రయిస్తున్నారు. తేమశాతం లేకుండా ఉంటేనే అక్కడ కూడా పత్తికి మద్దతు ధర దక్కుతుంది. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం పత్తి ధర క్వింటాకు రూ.6 వేలకు తక్కువగానే ఉంది. క్వింటా పత్తి తీసేందుకు కూలీలకు రూ.2వేల వరకు ఖర్చవుతుంది. ఈ పరిస్థితులు రైతులను మరింతగా కుంగదీస్తున్నాయి.

కూలీలు దొరకడం లేదు



పత్తి తీసేందుకు కూలీలు దొరకటం లేదు. వర్షాలతో పదిహేను రోజులు పత్తితీతలు ఆగిపోయాయి. కూలీల కోసం వేరే గ్రామాలకు వెళ్లిన ప్రయోజనం లేదు. చేలలో పత్తి కారిపోతోంది. అసలే దిగుబడులు లేవు. దీనికి తోడు కూలీల కొరత రైతులను ఇబ్బందిపెడుతోంది.

– వై.రామకృష్ణ, రైతు

కూలీల కోసం వెదుకుతున్నాం



పత్తి తీసేందుకు కూలీల కోసం దూరప్రాంతాలకు వెళ్లి వెతుకులాడుతున్నాం. అక్కడ కూడా పత్తి తీతలు, మిర్చి కోతలతో కూలీలు దొరకటం లేదు. కూలిరేట్లు కూడా పెరుగుతున్నాయి. ఈ ఏడాది పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితులు లేవు.

– రవీంద్రారెడ్డి, రైతు

‘యూడైస్’ క్షేత్రస్థాయి పరిశీలన



పాఠశాలలో సౌకర్యాలు పరిశీలిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం హరిత

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో యూడైస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇనఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్) నివేదికలో పొందుపరిచిన అంశాలపై కాంప్లెక్స్ హెచ్‌ఎం పి.హరిత క్షేత్ర పరిశీలన చేశారు. బుధవారం అశ్వారావుపేట కాంప్లెక్స్ పరిధిలోని పాపిడిగూడెం, చిన్నంశెట్టి బజార్, ఉర్దూ ప్రాథమిక పాఠశాల, నందమూరినగర్, బీసీ కాలనీ, ఏఎస్ఆర్ నగర్ పాఠశాలలను ఆమె సందర్శించి యూడైస్ నివేదికలో హెచ్‌ఎంలు అందించిన వివరాలు, క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను క్షుణంగా పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..యూడైస్ నివేదిక వాస్తవ వివరాలనే నమోదు చేయాలని, నిర్లక్ష్యం చేయద్దన్నారు. అన్నీ పాఠశాలల నివేదికలను పూర్తి స్థాయిలో తనిఖీ చేసిన తర్వాతే జిల్లా ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. త్వరలోనే జిల్లా పరిశీలకుల బృందాలు కూడా యూడైస్‌ను పరిశీలిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు, సీఆర్పీ సిద్దాంతపు ప్రభాకరాచార్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలోని పరికరాలను తరలించొద్దు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియ ఆస్పత్రి నుంచి అదనపు జిల్లా క్షయ(టీబీ) వ్యాధి నివారణా కేంద్రంలోని వ్యాధి నిర్ధారణ పరికరాలను తరలించవద్దని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం శాఖ అభ్యర్థించింది. ఈ మేరకు బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. 2020లో క్షయ వ్యాధి నిర్ధారణ సౌకర్యాన్ని మెరుగు పరచడానికి తెలంగాణ ప్రభుత్వం సుమారు రూ.60 లక్షలతో ‘ట్రూనాట్’యంత్రం, ‘సిబి నాట్’యంత్రాలను ఈ కేంద్రానికి అందించినట్లు రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు తెలిపారు. భద్రాచలంలోని అదనపు జిల్లా క్షయ వ్యాధి కేంద్రం కేంద్రీకృత ప్రాంతమని, ఈ కేంద్రం ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన క్షయ వ్యాధితో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. అటువంటి పరికరాలను ప్రభుత్వం కొత్తగూడెంకు తరలించాలని తీసుకువచ్చిన ప్రతిపాదనను పునః పరిశీలించాలని కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో ఈసీ కమిటీ మెంబర్ వై.సూర్యనారాయణ, ట్రెజరర్ జి.రాజారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఖాన్ ప్రసాద్ తదితరులున్నారు.

బలరామావతారంలో పర్ణశాల రాముడు



బలరామావతారంలో రామయ్య

దుమ్ముగూడెం: పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా 8వ రోజు బుధవారం రామయ్యను బలరామావతారంలో ఆలయ ప్రధాన అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు,అర్చకులు అమరవాది కిషోర్ అచార్యులు, రవికుమార్ శర్మ, వరప్రసాద్ శర్మ అలంకరించారు.ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించిన అర్చకులు అనంతరం స్వామి వారిని బలరామావతారంలో అలంకరించారు. సంరక్షునిగా పిలువబడే బలరాముడు ప్రలబాసురుడనే రాక్షసుని సంహరించడానికి ఎత్తిన ఈ అవతారాన్ని దర్శించడం వల్ల మాందిగు శికా గ్రహాల బాధలు తొలగిపోతాయని అర్చకులు వివరించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ఇ.కాశీ విశ్వనాథ్ బృందం శ్రీరామ సుగ్రీవ మైత్రి హరికథను అలపించారు. కార్యక్రమంలో ఆలయ ఎఈఓ శ్రావణ్‌కుమార్, అనిల్‌కుమార్, సూపరిండెంట్ కిషోర్, ఆలయ ఇన్‌చార్జ్ ప్రసాద్, సిబ్బంది రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో చైతన్యానికి సింగరేణి కృషి



బహుమతులు అందజేస్తున్న ఎస్ఓటు జీఎం వీసం కృష్ణయ్య

మణుగూరురూరల్: మహిళల్లో చైతన్యం కోసం సింగరేణి అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రోత్సహిస్తోందని ఎస్ఓటు జీఎం వీసం కృష్ణయ్య అన్నారు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పీవీ కాలనీలోని కమ్యూనిటీ హాల్ వద్ద మంగళవారం రాత్రి దీపాలంకరణ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా బస్సులు, రైళ్లు, విమానాలు నడపడంతో పాటు అంతరిక్షంలోకి విజయవంతంగా దూసుకెళ్తున్న స్త్రీ జాతికి ఎంతో గర్వకారణమన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే ఉద్దేశంతోనే సింగరేణి ఆధ్వర్యంలో అనేక శిక్షణలు ఉచితంగా ఇస్తూ ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇల్లందు లేడీస్ క్లబ్ సెక్రటరీ కవిత, రమ, భాస్కరి కవిత, సింగు శ్రీనివాస్, షకీరా, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్‌వెస్లీ తదితరులు ఉన్నారు.

పైపులైన్ పనుల అడ్డగింత



ఆందోళనకారులను సముదాయిస్తున్న పోలీసులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని రామాలయ పరిసరాల్లో ముక్కోటి ఏకాదశి ఉత్సవాల సందర్భంగా దుకాణాలను ముందుకు జరపకుండా ఆలయ సిబ్బంది ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్ నిర్మాణ పనులను స్థానికులు బుధవారం అడ్డుకున్నారు. దీంతో ఆలయ సిబ్బందికి దుకాణదారులకు కొంత వాగ్వివాదం జరిగింది. దుకాణాల ఎదుట అడ్డుగా పైప్‌లైన్ ఏర్పాటు చేస్తే వ్యాపారం నిర్వహించేందుకు ఇబ్బందిగా ఉంటుందని దుకాణదారులు ఆందోళన చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమనిగింది.

మున్నూరుకాపుల సంక్షేమానికి కృషి



ఎమ్మెల్యే పాయంను సన్మానిస్తున్న మున్నూరుకాపు సంఘ నాయకులు

మణుగూరురూరల్: మున్నూరుకాపుల సంక్షేమానికి కృషి చేస్తానని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని వేణు ఫంక్షన్ హాల్‌లో మున్నూరుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో తనకు మద్దతునిచ్చి విజయానికి సహకరించిన మున్నూరుకాపు సంఘానికి అన్ని వేళలా అండగా ఉంటానని అన్నారు. మున్నూరుకాపు గౌరవ భవనాన్ని నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా మున్నూరుకాపు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంక్షేమ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వన్నం కృష్ణమోహన్, గాండ్ల సురేష్, వలసాల వెంకటరామారావు, బేతంచర్ల వెంకటేశ్వరరావు, ఎడవల్లి వెంకటయ్య, మామిడిపల్లి సీతారాములు, పూజారి చందు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాయంకు సన్మానం

అశ్వాపురం: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మణుగూరులోని ఎమ్మెల్యే నివాసంలో ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు, శివకామేశ్వరి గ్రూప్స్, దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అశ్వాపురం మండల మున్నూరు కాపు సంఘం నాయకులు ఎమ్మెల్యే పాయంను సన్మానించారు. మాజీ ఎంపీపీ ఊసా అనిల్‌కుమార్, ఎంపీటీసీ కమటం నరేష్, నెల్లిపాక పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు కమటం సురేష్, పర్వత నరేష్, జెట్టి సాంబశివరావు పాల్గొన్నారు.

సాదాసీదాగా ప్రజావేదిక

ములకలపల్లి: ఈజీఎస్ 15వ సామాజిక తనిఖీ గ్రామసభ సాదాసీదాగా జరిగింది. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో గత ఏడాది కాలంగా చేపట్టిన పనులపై బుధవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. మండలపరిధిలోని 20 గ్రామపంచాయతీల పరిధిలో రూ.5కోట్ల 27లక్షల 51వేల 518లతో చేపట్టిన పనులపై గ్రామసభలో సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ మట్ల నాగమణి అధ్యక్షతన స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించగా జీపీల వారిగా చేపట్టిన పనులు, కేటాయించబడిన నిధులు, క్షేత్రస్థాయిలో గుర్తించిన లోపాలను డీఆర్‌పీలు చదివి వినిపించారు. మొత్తం సుమారు రూ.24 వేలు రికవరీలు విధించారు. రూ.14 వేలు పెనాల్టీలు విధించినట్లు అధికారులు తెలిపారు. అడిషినల్ డీఆర్‌డీఓ రవి. విజిలెన్స్ అధికారులు రమణ, అనూష, అంబుడ్స్‌మెన్ నాగప్రసాద్, ఎంపీడీఓ శ్రీను, ఎంపీఓ లక్ష్మయ్య, ఎస్సార్పీ సురేందర్, ఈజీఎస్ ఏపీఓ హుస్సేన్, ఎంపీటీసీ మెహరమణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల నగర సంకీర్తన



నగర సంకీర్తన చేస్తున్న అయ్యప్ప మాలధారులు

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని కాళీమాత ఆలయం అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వందలాది మంది అయ్యప్ప మాలధారులు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఉప్పల సత్యనారాయణ శాస్త్రి గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు స్వామిని పులిపై, పల్లకిపై, అశ్వంపై ఊరేగిస్తూ పట్టణంలో విస్తృతంగా కాలినడకన అయ్యప్ప శరణుఘోషతో ఊరేగించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బూర్గంపాడు: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. సారపాకలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

జూదరులపై కేసు నమోదు

దమ్మపేట: మండలంలోని మందలపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం మందలపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందింది. ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేసి, రూ.6130 నగదును స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

నిల్వ ఉంచిన ఇసుక సీజ్

మణుగూరురూరల్: మండలంలోని రామానుజవరం గ్రామ పంచాయతీలో ఎలాంటి అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన ఇసుకను రెవెన్యూ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఆర్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుకను నిల్వ ఉంచొద్దని, రవాణా చేయొద్దని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేసు నమోదు

దుమ్ముగూడెం: ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గణేష్ బుధవారం తెలిపారు. మండలంలోని ములకపాడు గ్రామంలో వాహన తనిఖీలు చేస్తుండగా యువకులు అతి వేగంగా బైక్‌లను నడుపుతుండటంతో వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కాలినడకన భద్రాచలానికి..

అన్నపురెడ్డిపల్లి: ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం సత్యాలపాడు గ్రామానికి చెందిన రామ భక్తులు ముక్కోటికి రాములోరిని దర్శించుకునేందుకు కాలినడకన భద్రాచలం బయలుదేరారు. బుధవారం వారు అన్నపురెడ్డిపల్లికి చేరుకున్నారు. స్థానిక శివాలయంలో స్వామిని దర్శించుకొని భద్రాచలం బాటపట్టారు.

‘సింగరేణి’లో ప్రచార హోరు



సమావేశంలో మాట్లాడుతున్న ఇఫ్టూ జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ప్రభాకర్

గెలిపిస్తే కార్పొరేట్ విద్య, వైద్యం

మణుగూరురూరల్: కార్మికులకు కార్పొరేట్ తరహాలో విద్య వైద్యానికి కృషి చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఓసీ–4లో టీవీఎం ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఫిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. 39 వేల మంది కార్మికులు సింగరేణిలో నిత్యం పనిచేస్తూ ప్రాణాలను ఫణంగా పెట్టి సింగరేణి కోసం కృషి చేస్తున్నారని కానీ విద్య, వైద్యం అందని ద్రాక్షగా మిగిలిందని రోజు రోజుకి కాలం మారుతున్న సమయంలో నాణ్యమైన విద్య ఎందుకు సింగరేణి అందించడం లేదని మండిపడ్డారు. గుర్తింపు సంఘంగా చెప్పుకునే యూనియన్లు ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి విద్య, వైద్యం కోసం ఏం చేశాయో కార్మికులకు తెలపాలన్నారు. ఒక్క అవకాశం సీఐటీయూకి కల్పించి మార్పుకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మచారి, లక్ష్మణరావు, ఈశ్వరరావు, కొడిశా రాములు, కొమరారెడ్డి సూర్యనారాయణ, రామ్మూర్తి, విల్సన్, సుమన్, గద్దల శ్రీనివాస్ ఉప్పుతల నర్సింహారావు, సత్రపల్లి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

విప్లవ కార్మిక సంఘాల కూటమిని గెలిపించాలి

కార్మిక హక్కుల పరిరక్షణకు, సింగరేణి సంస్థ మనుగడ కోసం గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో విప్లవ కార్మిక సంఘాల కూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇఫ్టూ జాతీయ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరరావు కార్మికులను కోరారు. గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మణుగూరు ఏరియాలోని పికెఓసి2, ఏరియా వర్క్‌షాప్, సింగరేణి ఆస్పత్రిలలో జరిగిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కోడ్ ఆఫ్ డిసిప్లెన్ పేరుతో కార్మిక సంఘాల గొంతుని, కార్మిక హక్కులను కాలరాసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహార తీరును ఎండగట్టాలన్నారు. బొగ్గు బావుల ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణను అడ్డుకునేందుకు, నూతన బావుల ఏర్పాటు, కార్మికుల ఆధాయపు పన్నుపై రద్దు తదితర సమస్యల పరిష్కారం విప్లవ కార్మిక సంఘాలతో సాధ్యమన్నారు. ఈ నెల 27న జరిగే సింగరేణి గుర్తింపు సంఘ ఎన్నికల్లో చక్రంలో సుత్తి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.సీతారామయ్య, రాష్ట్ర కార్యదర్శి నాసర్‌పాషా, మరికంటి సిద్దయ్య, టీజీఎల్‌బీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొని నాగేశ్వరరావు, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.అనురాధ, జిల్లా కార్యదర్శి ఎండి.రాసుద్దీన్, ఏరియా నాయకులు మంగీలాల్ పాల్గొన్నారు.

టీబీజీకేఎస్‌నే గెలిపించాలి

మణుగూరురూరల్: ఈ నెల 27న జరిగే సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కార్మికుల మేలు కోరే టీబీజీకేఎస్ నే గెలిపించాలని బ్రాంచి ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు అన్నారు. బుధవారం కొండాపురం భూగర్భగని ఫిట్ సెక్రటరీ నాగెల్లి అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. సింగరేణిలో గెలిచిన ఏఐటీయూసీ కార్మిక హక్కులను తనకా పెట్టి ప్రైవేటీకరణకు ఊపిరిపోస్తే తర్వాత గెలిచినప ఐఎన్‌టీయూసీ తానేమీతక్కువ కాదన్నట్లు కార్మికులు పోరాడి సాధించుకున్న మరికొన్ని హక్కులను పాగొట్టిందన్నారు. ప్రైవేటీకరణకు వేగం పెంచిన సంఘాలు నేడు టీబీజీకేఎస్‌పై అసత్య ఆరోపణలు చేయడం దుర్మార్గమైన విధానం అని తెలిపారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ హయాంలో పాగొట్టిన అనేక హక్కులను టీబీజీకేఎస్ గుర్తింపు కార్మిక సంఘంగా గెలిచిన తర్వాత కూడా తిరిగి సాధించిందన్నారు. కారుణ్య నియామకాల సాధనతో పాటు 3400 మంది పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలను ఒకసారి ఇప్పించడంతో పాటు పలు మహిళా కార్మికులకు కారుణ్య నియామకాలు సాధించామన్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్‌రవూఫ్, వీరభద్రయ్య, కాపా శివాజీ, సీహెచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, వర్మ, సురేశ్, ఆర్.శ్రీనివాస్, అఖిల్, కారం సాగర్, మహేశ్, గాంధీ, ప్రేమ్‌కుమార్, కృష్ణ, హుస్సేన్ రెడ్డి, వేముల భాస్కర్, కొన వెంకటేశ్, బంగారి పవన్ కుమార్, దాసుమల్ల ప్రవీణ్, ఈర్ల రాజేశ్ తదితరులు ఉన్నారు.